భర్తృక

ఆంధ్ర సాహిత్య పరిషత్తు. కాకినాడ. TELUGU ACADEMY, COCANADA

శ్రీ ఇనుకపల్లి దక్షిణామూర్తి

ఏ పసికందు పెరిగి పెద్దదై "నాన్నా" అని తనను పిలిస్తే 'ఏం సమాధానం చెప్పాలి' అని ప్రశ్నించుకున్నాడు గోపాలం. అతనికి సమాధానాలు అనేకం. అవన్నీ చెప్పి పాపమనస్సు పాడు చెయ్యలేడు తను. అసలవన్నీ సమాధానాలుగూడా కావు. తన మనసులో మంటల్లా చెలరేగుతున్న అనేకమైన భావాల రూపాలు అవి. అవి నిజమూ కావు. అబద్ధమూ కావు, మళ్లీ పాపకళ్లల్లోకి చూస్తాడు. పార్వతి కనిపిస్తుంది. 'నాకు తీరని అన్యాయం చేశావు నువ్వు' అని చెబుదా మనుకుంటాడు. పాప నవ్వుతుంది. పసిడిబుగ్గల్లో వెన్నెల కాస్తుంది. ఆ కళ్లల్లో అనంతమైన ఆకాశం, అవధుల్లేని సముద్రాలు కలిసిపోయినట్లుంటుంది. అందులో ప్రకృతి ఉదయిస్తుంది. క్షీరసాగరమథనంలో హాలాహలం కదిలినట్లు ఏదోభయం... ఏదో ఛాయ తనను భయపెట బోతుంది. గోపాలం పాపను దగ్గరగా తీసుకుని 'నీకు అన్యాయం చేస్తాననుకున్నావా...భగవంతుడు ఇంకా బ్రతికే వున్నాడు... నీకేం భయం లేదమ్మా...' అంటూ గొణుక్కుంటాడు. పాప మళ్లీ నవ్వుతుంది.

పార్వతి తనకు అన్యాయం చేసిందేమో అనుకుంటాడు గోపాలం. అన్యాయం చెయ్యలేకనే వెళ్లిపోయాననుకుంటుంది పార్వతి. ఎక్కడికి వెళ్లిందో, ఏమో ఎవరితో చెప్పిపోలేదు. ఈ విశాల ప్రపంచంలో ప్రతి జీవితానికి ఏదో ఒకరకమైన ఆధారం వుండనే వుంటుంది. పార్వతి బ్రతక లేకపోదు. అందుకోసం కాదు గోపాలం విచారం. పార్వతి చచ్చిపోయినా అంతగా దుఃఖించే వాడు గాదేమో! పార్వతి తనకూ ప్రపంచానికీ అన్యాయం చేసిందని గోపాలం బాధ. అంతా కలిసి తనకు అన్యాయం చేశారనుకుని వారందరినీ విడిచి వెళ్లిపోయింది పార్వతి. ఇందులో నిజానిజాలు నిర్ణయించటానికి నిజమంటూ ఒకవస్తువు ఏముంటుంది గనక. అది వారివారి సంస్కారాన్నిబట్టి ఉంటుంది. ఇంతకీ జరిగిన సంగతిఇది.

గోపాలం, పార్వతి ఎవరు అని అడుగుతారు. ఒక అబ్బాయి. ఒక అమ్మాయి. వాళ్లచరిత్రలు ఏమంత పెద్దవిగావు. సాధారణ కుటుంబాల్లో జన్మించి ఒక ఇంట్లో ఉంటూవచ్చారు. ఒకరికొకరు ఎంతకాలంగానో తెలుసు. అదీ వారి పరిచయం. పార్వతికి పెళ్లయిందని, ఆమెభర్త కొంతకాలందాకా ఉండేవాడనీ గోపాలానికి తెలుసు. విగతభర్తృక పార్వతి. పార్వతితో మాట్లాడితే సమాధానం చెబుతోంది. ఆమె ఎప్పుడూ నవ్వగాగాని, ఏడ్వగాగాని ఎవ్వరూ చూచి ఎరుగరు. గోపాలం ఎప్పుడన్నా ఆమెకళ్లల్లోకి చూడగలిగితే నవ్వూ, ఏడుపూ కలిసి ఎన్నో భావాలు తనహృదయానికి వచ్చి తాకుతాయి. తాను ఏదో చెబుదామనుకుంటాడు. పార్వతి తనను గురించి ఏమనుకుంటున్నదో తెలియదు. తనభావాల ప్రతిబింబాలు అక్కడకూడా వుంటాయి అనుకుంటాడు అతను.

గోపాలాన్నడిగితే పెళ్లిఅయినవాళ్ళందరికీ పెళ్లికానివాళ్ళందరిమీద ఒకరకమైన ఈర్ష్య అంటాడు. దానికి కొన్ని కారణాలు గూడా వున్నాయి అతని దగ్గర. అంతా తనను పెళ్ళిచేసుకోమని బలవంతం చేస్తారు. తను సుఖపడుతుంటే చూస్తూ వూరుకోలేకనే గదా అని అతని అభిప్రాయం. పెళ్ళివిషయం వస్తే అతనిలో ఏవేవో ఆవేశాలు వస్తాయి. వైవాహికజీవితంలోని సుఖాలను గురించి కాదు. తన ఆశయాలు ఫలించే రోజులు వస్తున్నాయనే గుర్వాటు. భగవంతుడు ప్రసాదించిన ఈజీవితానికి ఏదో ఉపయోగం వుండాలి. తను మరణించే లోగా ఏదన్నా మంచి పని ఒక్కటన్నా చెయ్యాలి అనుకుంటాడు. "పార్వతిని పెళ్ళిచేసుకుంటాడు తను..." ఆమాట తలచుకున్నప్పుడల్లా ఆవేశం వచ్చి ముఖం కందిపోయేది. తను ఒక నిర్ణయానికి వస్తాడు. పార్వతి తనకు భార్య అవుతుంది. జీవితానికి ఇంకేం అక్కర్లేదు అనుకుంటాడు.

కాలేజీ చదువుకోసం పొరుగూరులో వున్నప్పుడు గోపాలం మనస్సు స్థిమితంగా వుండేదిగాదు. ఎప్పుడూ పార్వతి గురించే ఆలోచన. అప్పటికి వచ్చి ఆరునెలలు దాటుతోంది. పార్వతిని చూడాలన్న కుతూహలం అతన్ని కదల్చివేస్తోంది. ప్రతిసారీ ఏవో అడ్డంకులు సెలవుపెట్టి పోవటానికి. ఇక వుండబట్టకపోయాడు. కాలేజీకి సెలవుపెట్టి పరుగులెత్తుకుంటూ వచ్చాడు ఇంటికి.

సొంతవూళ్ళో ఎరగని వాళ్ళేలేరు. సామానంతా బండిలో ఎక్కించి బండివాడి పక్కముందుగా కూర్చున్నాడు. బండివాడికి గోపాలాన్ని చూడటంతోటే పార్వతి గుర్తుకు వచ్చింది. అతను పొరుగూరునుంచి వచ్చినాసరే తన బండీమీదనే గోపాలం ఇంటికి తీసుకుపోతాడు. అతనికి వరస అది. ఇంట్లో సంగతులు కొంచెం కొంచెం పసికడతాడు.

'పార్వతమ్మగారు ఆసుపత్రిలో వున్నారు తెలుసా... అండీ...' అంటూ ప్రశ్నించాడు బండివాడు. ఆ బండిలోనే పార్వతిని ఆసుపత్రిలో చేర్పించింది. ఆ మాటవింటూనే గోపాలం గుండె బెదిరిపోయింది. కారణాలు అతను చెప్పలేదు. సామాను ఇంటికి తీసుకుపొమ్మని బండివాడికిచెప్పి గోపాలం వురుకు లెత్తుకుంటూ ఆసుపత్రికి పోయాడు.

పార్వతిని ఇంట్లో లేకుండా ఆసుపత్రిలో చూడవలసి వస్తుందని గోపాలం అనుకోలేదు. ఆసుపత్రి గదినుంచి నర్సు బయటకు

వస్తా 'మీరు లోపలకు పోవచ్చు' అని చెప్పి వెళ్ళిపోయినప్పుడు ఒక క్షణం గుండె దడదడలాడింది అతనికి.

ఆమె మంచందగ్గర ఎవ్వరూ లేరు. అతనికి కొంచెం భయం వేసింది. చొరవ చేసుకుని మంచందగ్గరకుపోయి నిలబడ్డాడు. పార్వతి అతన్ని చూడటంతోటే అదిరిపడ్డది. ఆమె ముఖంలో పల్లని నీడలు కదులాడినాయి. లేచి కూర్చోవాలని ఆమె ప్రయత్నిస్తున్నట్లు గమనించిన గోపాలం 'వద్దు... అలాగే పడుకో' అని గది నాలుగు మూలలా కలయచూశాడు.

ఆమె నేత్రాలు ఏవేమిటో ప్రశ్నిస్తున్నాయి. చాలా నీరసంగా వుంది. మాట్లాడటానికి ప్రయత్నించి తొట్రుపాటు పడటంతో గోపాలం అందుకుని 'ఇప్పుడేవచ్చాను...రైలుదిగి బండీమీద వస్తుంటే బండీవాడు చెప్పాడు..."అన్నాడు.

'ఏంచెప్పాడు...' అన్నట్టు ఆదుర్దాగా చూసింది పార్వతి.

'ఎలా అయిపోయావు పార్వతీ ... నిన్ను ఇంకోరకంగా వూహించుకుంటూ వచ్చాను...అసలేం జరిగింది...ఏమిటిసుస్తీ...' ఆదుర్దా కనపరిచాడు. పార్వతి ముఖం రెండో పక్కకు తిప్పుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. గోపాలం చూడలేకపోయాడు.

'అధైర్యపడకుపార్వతీ...నేను వచ్చానుగా! అంటూ ఆమె ముఖం స్పృశించబోయాడు. ఆమెలో అంతశక్తి ఎలా వచ్చిందో ఏమో...'నన్ను ముట్టుకోకండి' అంటూ పెద్దపెట్టున అరిచింది. గోపాలం విభ్రాంతపోయాడు. పార్వతి అతనివైపు ముఖం తిప్పనేలేదు. 'ఏమిటి...ఏమిటి...' అంటూ ఆదుర్దాగా ప్రశ్నించాడు.

'నన్నడక్కండి...నన్నడక్కండి...' అంటూ గొణిగింది పార్వతి. గోపాలం బరువుగా లేచి నిలబడి అటూ ఇటూ చూశాడు.. ఏదో భయంకరవాతావరణంగా వున్నట్లు తోచింది.

'మళ్ళీ వస్తాను...' అంటూ విసురుగా బయటపడి ఇంటికి వచ్చేశాడు.

ఇంటికిపోయేటప్పటికి వర్ధనమ్మ వాకిట్లో ఎదురుచూస్తూ నిలబడింది. తను సందుచివర కనబడటంతో మెట్లుదిగి ఎదురువచ్చి 'ఏం బాబూ ఇంతచిక్కిపోయావు' అంటూ కుశలప్రశ్న వేసింది. గోపాలం నవ్వుతూ 'హోటళ్ళలో నీలాగా అన్నం తినిపిస్తారా పిన్నీ...ఆరు నెలలు దాటింది తృప్తిగా అన్నంతిని...అన్నాడు.

'సరే కబుర్లకేంలే ... ముందర కాళ్ళు కడుక్కునిరా ... నీకిష్టం అని పూర్ణబూర్లుకూడా చేశాను...' అంటూ లోపలకు తీసుకుపోయింది వర్ధనమ్మ.

ఇంట్లోకి అడుగు పెడుతుండగా తండ్రి ఎదురుపడి 'పదిహేను రోజుల్లో పరీక్షలుపెట్టుకుని ... ఇప్పుడేం ముంచుకుపోయిందని వచ్చావు" అని అడిగి సమాధానం కోసమయినా ఆగకుండా వీధిలోకి వెళ్ళిపోయాడు. గోపాలం నవ్వుకుని 'నాన్నకు నామీద కోపం తగ్గలేదల్లేవుందే...' అన్నాడు,

'నయం...మీనాన్న మంచివారు కాబట్టి సరిపోయింది. ఇంకొకళ్ళయితే ఏమన్నావుందా...పార్వతి సంగతి తెలుసా ఏమయిందో' అన్నది.

'నేనే అడుగుదామనుకుంటున్నాను...ఏమయిందేమిటి' అని అడిగాడు ఆదుర్దాపడుతూ. వర్ధనమ్మ పింగాణీపళ్లెంలో పూర్ణబూరెలు పెడుతూ 'పెద్దవాళ్ళం చెబితే చాదస్తం అన్నావుగాని.. పార్వతికి సుస్తీమిటో తెలుసా నాయనా...చెడిపోయినవాళ్ళందరికీ వచ్చేదే' అంది మెల్లిగా.

గోపాలానికి ఆమాట పెద్ద అఘాతంలా తగిలింది.

'జరిగిందేమిటో చెప్పకుండా...చెడిపోయింది..చెడిపోయింది అనటం ఎందుకుపిన్నీ' అన్నాడు.

'ఉన్నమాటఅంటే తప్పొచ్చిందేమిటిరా...' అని అడిగింది వర్ధనమ్మ.

'తప్పొప్పులు పట్టటంలేదు...అనవసరంగా నిందించవద్దని అంటున్నాను...నేను పార్వతిని పెళ్లిచేసుకుంటే...' అంటూ ఇంకేదో చెప్పబోతుండగానే వర్ధనమ్మ సబ్బురాలైంది. ముఖం అంతా ఎర్రగా కందిపోయింది.

'అయితే నువ్వు పార్వతిని పెళ్ళిచేసుకుంటావు...మతివుండే మాట్లాడుతున్నావా...' అని అడిగింది వర్ధనమ్మ కుప్పగా కాలిపోతూ.

'అవును...' అంటూ గోపాలం ముందరవున్న పళ్ళెం వదిలేసి దొడ్లో చెయ్యికడుక్కుని ఇంట్లోకి వచ్చాడు. వర్ధనమ్మ వెనకాలగానే వచ్చింది.

'నే నొక్కమాట అడగనా పిన్నీ....'

'ఏమిటి...?'

'పార్వతికి ఇరవై ఏళ్లుగాదూ...ఆమె మిగిలిన జీవితమంతా నిస్సారంగా...నిష్ఫలంగా గడిచిపోకుండా నేను చేయగలిగితే మంచిదేకాదు పిన్నీ...'

వర్ధనమ్మ నిట్టూర్చింది. ఆమె కళ్లలో ఎన్నో దృశ్యాలు మెదిలినాయి. ఆమెకు తన జీవితము గుర్తుకు వచ్చింది. ఆమె కళ్లలో నీళ్లు కదిలినాయి. ఒక క్షణం ఏమీ మాట్లాడలేకపోయింది.

'ఏమో నాయనా...ఈ ఆవేశాలూ...అనర్థాలూ నాకేం తెలియవు...మీ నాన్న ఇంకేదో సంబంధం చూస్తున్నారు...పిల్ల బాగా వుంటుందట...'

'పార్వతిమటుకు బాగాలేదా పిన్నీ...ఆమె జీవితం ఏం కావాలి...అంటే మీరెవరూ మాట్లాడరేం' అంటూ గంయిమన్నాడు. వర్ధనమ్మ సంబాళించుకోలేకపోయింది. ఆమెకు వెంటనే సమాధానం దొరకలేదు. పార్వతి రెండు సంవత్సరాల కాపురం ఆమెకు గుర్తు వచ్చింది. పాతివ్రత్య ధర్మం బ్రద్దలైపోతున్నది. ఆమెకు భయంవేసింది. పార్వతి జీవితం ఏం కావాలి? గోపాలం అడిగిన ప్రశ్న సబబుగా నేతోచింది. కనకయ్య సంబంధం తీసి కట్టేంగాదు. చిన్ననాటినుంచి ఎరుగున్నవాళ్లు. ఆ అమ్మాయి గోపాలంమీద ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తోంది. ఆ అమ్మాయి జీవితం ఏం కావాలి? గోపాలానికి ఆ మాట తట్టకూడదూ? అనుకున్నది. రెండేళ్ళు కాపురంచేసిన పార్వతిని చెడిపోయిందంటే అదిరిపడ్డ గోపాలానికి శీలం అంటే ఏమి తెలుసు? తనెలా చెబు

తుంది! వర్ధనమ్మ ముభావంగా వూరుకుంది. ఆమె దగ్గర సమాధానం లేదు అనుకున్నాడు గోపాలం.

ఆ రోజు సాయంత్రం కనకయ్యకూతురు సంబంధం మాట్లాడి పోవటానికి వచ్చాడు. గోపాలం ఎవరితోటీ మాట్లాడకుండా ముభావంగా వుండిపోయాడు. వర్ధనమ్మకూడా ఏ విషయం చెప్పలేదు. కనకయ్య చిన్నబుచ్చుకున్నాడు. 'నేను మాట్లాడి ఏ విషయం తెలుపుతానులే...' అన్నాడు గోపాలం తండ్రి రమణయ్య. కనకయ్య వచ్చినదారినే నిరాశతో వెళ్ళిపోతూ 'మొట్టమొదటినుంచి అనుకుంటున్న మాట...మన కుటుంబాలు నాలుగు కాలాలపాటు కలిసి వుండేటట్లు చూడటం మన బాధ్యత... అందుకే నాయీ తాపత్రయం...'అని చెప్పేసి ఉత్తరీయం భుజంమీద సర్దుకుని చేతికర్ర ఆడించుకుంటూ వెళ్ళిపోయాడు.

కనకయ్య గడప దాటాడో లేదో రమణయ్య విరుచుకుపడ్డాడు గోపాలంమీద.

'ఎవరిని చేసుకుంటావురా జానకినిగాకుండా...ఈ సంబంధం అనుమానంలో పడ్డప్పటినుంచి జానకి దిగులుపడి మంచం ఎక్కింది తెలుసా...మా పిన్ని అంతా చెప్పిందిలే...నీ పిచ్చి, మైత్రి వ్యవహారాలు సాగవు తెలిసిందా...?' గోపాలం ఏమీ మాట్లాడక పోయేటప్పటికి

'ఏంరా... ఎవరికీ చెప్పేది...గోడలకు అనుకున్నావా... మాట్లాడితే ముత్యాలేమన్నా రాలిపోతా యనుకుంటున్నావా...' అంటూ గర్జించాడు రమణయ్య.

గోపాలం గొంతు పెగల్చుకుని 'నన్నేమన్నా మాట్లాడనిస్తేనా...'అంటూ గొణిగాడు.

'మాట్లాడను నేనెవరా చెప్పేది...నీ క్షోభ ఏమిటో చెప్ప రాదూ...' గొంతులో స్వరం ఏమాత్రం తగ్గలేదు.

'నాకీ పెళ్లి ఇష్టంలేదు...'

'అది తెలుస్తూనేవుంది...ఎందుకో అఘోరించరాదూ...'

'నేను పార్వతిని పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను...'

రమణయ్యకు వళ్లు మండిపోయింది.

'విధవ ముండను పెళ్ళి చేసుకుంటావుటరా...సిగ్గులేదూ ఆ మాట అనటానికి...థూ' అని తుపుక్కున ఉమ్మేశాడు. 'నాన్నా...'అంటూ గట్టిగా అరిచాడు గోపాలం 'నేను పార్వతిని తప్ప ఎవరినీ పెళ్ళి చేసుకోదలచుకోలేదు...ఆమెను మీ యిష్టం వచ్చినట్లు మాట్లాడకండి...' అన్నాడు.

రమణయ్య నిర్ఘాంతపోయాడు.

'ఏమిటి కూసింది...' అంటూ మీదకు లేచాడు.

'ఏమీ లేదు...లే'

'అదేదో తేలాలి...'

'అంత నిక్కచ్చిగా తేలాలనివుంటే నా మాట పూర్తిగా వినండి...పార్వతికి జరిగిన అన్యాయం చాలు...మీరు నన్నేం చేసినాసరే...పార్వతినే చేసుకుంటాను...ఆ మాట చెప్పిపోదా మనే వచ్చాను...'అంటూ ఆవేశపడుతూ చెప్పాడు. రమణయ్య ముఖం కందిపోయింది. గోపాలం ముఖం జేవురించింది.

'పాండి...అంత గంగలోకి దిగండి...పార్వతిని ఎట్లా చేసుకుంటావో చూస్తానుగా...' గళం అంతా ఎత్తి అరిచాడు రమణయ్య.

'పార్వతినే పెళ్ళిచేసుకుంటావుటరా...' మళ్ళీ నొక్కి అన్నాడు రమణయ్య.

గోపాలం కళ్ళు ఎర్రగా మండిపోతున్నాయి.

'ఆ...ఆమెనే చేసుకుంటాను...'

'ఆమె ఆసుపత్రిలో ఎందుకువుందో తెలుసా...'

'............'

'తెలీదు...నీకు...చెపుతావిను...చెడుగా తిరిగి భయపడి ...మందుపుచ్చుకుని...చావలేక ఆసుపత్రిలో చేరింది...కులట... మహాపతివ్రత అని నాకు చేద్దా మనుకుంటున్నావురా...సిగ్గులేదురా నీకు...' అని చేతిలోవున్న తుండుగుడ్డ దులిపి భుజంమీద వేసుకుని దొడ్లోకి చరచరా పాములాగా బుసలుకొట్టుతూ వెళ్లిపోయాడు. గోపాలం హతాశుడై అలాగే కొయ్యలాగా నిలబడిపోయాడు.

ఆపూట అన్నం హితవుదోచలేదు గోపాలానికి. పార్వతి చెడిపోయిందా? అతని మనసు కలవరంపొందింది. వల్లపోసుకో కుండా లేచేటప్పటికి వర్ధనమ్మ చెబితేగాని తెలియలేదు. అయోమయంగా ఒకక్షణం నిలబడి వెళ్లిపోయాడు. వర్ధనమ్మ వంటపనంతా చేసుకుని గోపాలందగ్గర చేరింది. 'నాన్న మాటలన్నాడని అభి మానం వచ్చిందిగదూ' అంది. గోపాలం మాట్లాడలేదు.

అందుకనే కామోలు పార్వతి తనకు ముఖంచూపించలేక పోయింది. తను బయటకు వచ్చేస్తుంటే మాటఅన్నా చెప్పలేదు. తనస్పర్శను నిరసించి పారేసి బిగ్గరగా అరిచిందెందుకు? తనను మోసంచేసిందా? ఎన్నో వూహించుకున్నాడు. తనుచేయబోయే త్యాగానికి ఇంత విలువకట్టిందా...ఛీ...'అనుకున్నాడు.

మరునాడు ఉదయమే ఆసుపత్రికి పరుగులెత్తుకుంటూ వెళ్లాడు. పార్వతి ఎవరో నర్సుతో కబుర్లుచెబుతోంది. తనురాగానే నర్సు లేచినిలబడి పక్కకు వెళ్లిపోయింది. పార్వతిముఖంలో నవ్వు మాయమయింది. వానమబ్బుల్లాగా విషాదఛాయలు ఆమెముఖం మీదకు పరుగులెత్తుకుంటూ వచ్చినాయి. ఆమె నేత్రాలు అశ్రుపూరితాలయినాయి. తనవంక ఒకక్షణం చూసినదల్లా ముఖంపక్కకు తిప్పుకుని దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది.

గోపాలం అలాగే నిలబడి 'అంతా తెలిసింది...' అన్నాడు.

పార్వతి ముఖంతిప్పకుండానే! 'నేనూ అదే కోరుకున్నాను. నా బాగుకోరితే నాతో మాట్లాడకండి...ఆ ఋణం తీరిపోయింది..!' అంటూనే వలవలా ఏడవసాగింది. గోపాలం హృదయం కొద్దిగా ద్రవించింది. ఆగ్రహంతో వచ్చిన తనకు ఆమెమాటలు పానుభూతితో నిజాలనే ఇవ్వకలిగింది.

'ఇంత అన్యాయం చేస్తాననుకోలేదు......' అన్నాడు గోపాలం అలాగే నిలబడి.

'అ...నేను అన్యాయం చేశానా...నేనా...నేను...'ఆమె బిగ్గరగా మాట్లాడసాగింది. గోపాలం నివ్వెరపోయాడు. ఎవరో నర్సువచ్చి 'ఏమన్నా కావాలా...' అని అడిగి వెళ్లిపోయింది.

'నువ్వుకాదూ అన్యాయంచేసింది...అలా ఏడుస్తావెందుకు ...సంఘాన్నీ, కన్నతండ్రిని ఎదిరించి, నీకోసమని...' అంటూ ఆవేశపడుతూ ఇంకేదో చెప్పలేక ఆగిపోయాడు.

పార్వతి ఒకక్షణం మెల్లిగా 'నామాట వింటారా...' అని అడిగింది.

'అందుకేగా వచ్చింది...'

పార్వతి పక్కనే స్టూలుమీద వున్న గాజుగ్లాసులో పళ్ళరసం తాగుతూ 'కూర్చోండి...' అంది. గోపాలం బ్రదున కుర్చీ పీట లాక్కుని కూర్చున్నాడు. పార్వతి గ్లాసు మంచంకింద పెట్టి మెల్లిగా చెప్పటం మొదలు పెట్టింది.

'నిజంగా నా కిప్పుడే జ్ఞానోదయం అవుతున్నట్లుంది... ఏమిటో అర్థంకాని ఆనందం కలుగుతోంది...అది ఆనందమో విషాదమో తెలియటంలేదు...హాలాహలానికీ, అమృతానికీ తేడా ఏమిటి అనిపిస్తోంది ఇప్పుడు...రెండూ పాలసముద్రంలో నుంచి వచ్చినవే గదూ...ఒకదానికొకటి మారురూపం అనుకుంటాను...'

'ఆ వాదంతా ఎందుకు...కావాలసింది చెప్పకుండా...'

'చెపుతాను ... నేను హాలాహలంమింగాను, అమృతం తాగాను...అందుచే మనసులో వున్నది చెప్పగలుగుతున్నాను... మీరు సంఘాన్ని ఎదిరించామన్నారే...తండ్రిని ఎదిరించామన్నారే...ఎందుకు...మీ పేరుకోసం ... ప్రఖ్యాతులకోసం ... విధవా వివాహం చేసుకుని సంఘాన్ని ఉద్ధరించావని ఊళ్ళో దండలు వేయించుకుందామని గాదూ...' గోపాలం తెల్లబోయి చూస్తున్నాడు.

'నన్నట్లాగే అర్థంచేసుకున్నావన్నమాట' పళ్లు పటపట లాడించాడు...పార్వతి అతి నిర్లక్ష్యంగా చూసి...'ఇదివరకు అలా అర్థంచేసుకోలేదు...ఇప్పుడు తెలుసుకోగలిగాను...పళ్లు కొరుకుతా రెందుకు...ఒకొక్కళ్ళు ఒక అభిప్రాయాన్ని సృష్టించుకుని దానికి బానిస లవుతారు...కొందరికి డబ్బు...కొందరికి అందం... కొందరికి పేరుకావాలి...వీళ్లలో వున్న ఒకొక్క బలహీనతను ఆదర్శంగా కూర్చుకుని, రంగులువేసి మాట్లాడుతారు...మీరు మటుకు...పేరుకోసం కాకపోతే...' పార్వతి గద్గదరై, కన్నీరు కార్చటం మొదలుపెట్టింది. గోపాలనికి భయంవేసింది. ఆశ్చర్యం వేసింది. ఆమె మనసులోకి ఇటువంటి ఆలోచనలు ఎలా చేరాయో అతనికి అంతుపట్టలేదు. వర్ధనమ్మ మనసులో మెదిలింది. కనకయ్య గుర్తుకు వచ్చాడు. తండ్రి గుర్తుకువచ్చాడు. అంతా తన కళ్లముందర నడిచిపోతున్నారు. వాళ్ళొక్కరికీ పార్వతి సంగతి పూర్తిగా తెలియదు. ఆమె ఆసుపత్రిలో చేరటంవరకే తెలుసు. ఈ అవస్థకి మూలం ఎక్కడుందో తనొక్కడికే తెలుసు. పార్వతికి తెలుసు...సంఘం అంటే ఎవరు? తనూ, పార్వతీ కాదు. ఇంకా నాన్న, పిన్ని కనకయ్యలాంటివాళ్ళు అనేకులున్నారు. తప్పుచేసిన వ్యక్తి నిర్భయంగా తప్పు అంగీకరించి క్షమాపణ కోరుకోగల మానసిక స్థైర్యం ఆ వ్యక్తికి కలగనీయరు. ఆ తప్పుకో దారి తెన్ను తెలియక తన్నుకులాడిపోతూ నికృష్టమైన జీవితం గడుపుతుంటే 'ఛీ' అని ఉమ్మేసే వాళ్లూ, 'పాపం' అని జాలిపడేవాళ్ళు. తనొక్కడూ ఏం చెయ్యగలడు? ఏమీ చెయ్యలేడా?

తనే చెయ్యలేకపోతే ఒకొక్క వ్యక్తిగా సంఘంలోని ఇతరులు మటుకు ఏం చేయగలుగుతారు...' నేనేం చెయ్యాలి...' అంటూ గోపాలం తలపట్టుకున్నాడు. అతని శిరస్సు వేడెక్కిపోయింది.

'నీ కన్యాయం చెయ్యను...నీ కన్యాయం చెయ్యలేను...' అంటూ గొణిగాడు. 'నిన్ను ప్రేమించాను...నన్ను నమ్ము...' అంటూ ప్రాధేయపడుతూ అడిగాడు.

'మిమ్మల్ని మళ్ళా నమ్మనా...చేసిన తప్పునే మళ్ళా చెయ్యమంటున్నారా...' పార్వతి మాటలు ములుకుల్లాగా వచ్చినాయి.

గోపాలం ఆమెవంక తీక్షణంగా చూశాడు. పార్వతి దీనంగా చూచింది. గోపాలం కంట తడిపెట్టాడు. పార్వతి గద్గదస్వరంతో 'నా సంగతి అంతా తెలిసిందా...' అంటూ గొణిగింది.

గోపాలం మనస్సు పరిపరివిధాల పోయింది. పార్వతికి పాప కలుగుతుంది. అతని హృదయం ఝల్లుమంది. ఎన్నో జ్ఞాపకాలు, మధురమనుకున్న క్షణాలు, మనసులో గిరగిర తిరిగినాయి. తను నిర్లక్ష్యం చేయబోతున్నాడని నమ్మింది పార్వతి. 'నిజంగా వివాహం చేసుకోటానికే నిశ్చయించుకున్నావనీ, అందుకే ఇప్పుడు వచ్చావనీ' ఎలా చెప్పటం అన్నది అతనికి తెమలనే లేదు. పార్వతిని నమ్మవచ్చా? అన్న సంశయం అతన్ని మరీ బాధిస్తూవచ్చింది. ఆమెలో పెరుగుతున్న ఛాయ ఎవరిది? నీడనుబట్టి మనుష్యుల నెలా పోల్చుకోవటం—

గోపాలం ఆలోచనలు ఒకదారి నడవటంలేదు. విధవరాలైన పార్వతిని వివాహం చేసుకోదలచిన తను, ఏపాపం ఎరుగని ఆ పసికందును క్షమించలేడూ? పార్వతినే స్వీకరించగలిగిన తను ఆ పాపను స్వీకరించలేడూ? ఏమిటి? ఏం చెయ్యాలి...ఆవేశంలో కలిగిన పరిణామాలకు యావజ్జీవం కృంగి కృశించాలా? తన జీవితంకోసం, పార్వతి జీవితాన్ని తను నాశనంచెయ్యలేడు. కాదు. పార్వతి కులటా? కుళ్ళి చావలసిందే! అవును...కాదు...గోపాలం వున్నట్టుండి హఠాత్తుగా గదినిడిచి బయటకు వచ్చేశాడు. ఎందరెందరో వారి వారి పనులమీద తిరుగుతున్నారు. తన బాధ ఒక్కరికీ అర్థంకాదు. పార్వతీ, పాప చనిపోతే, ఆ పుసురెవరికి తగులుతుంది. 'భగవాన్ నాకు జ్ఞానం ప్రసాదించు...' అనుకున్నాడు.

ఎక్కడున్నా గోపాలానికి కంటి రెప్పలలో పార్వతి మెదులుతోంది. అన్నం సహించటంలేదు. కునుకు పట్టటంలేదు. తలనొప్పి విపరీతంగా బాధపెడుతోంది. రోజులు దొర్లుకుపోతున్నాయి. కనకయ్య చాలా తరుచుగా వస్తున్నాడు. ఒంట్లో బాగా లేదని పరీక్షలకు వెళ్ళటం మానుకున్నాడు గోపాలం.

రమణయ్య తీరిక వున్నప్పుడల్లా లోకాన్ని గురించి అందులో వున్న వాళ్ళ బాధ్యతలను గురించి కనకయ్య కూతురు సంబంధంతో కలిపి నూరిపోస్తున్నాడు. గోపాలం అన్నీ విని వూరుకుంటాడు. తను ప్రత్యేకించి మళ్ళా చెప్పదలచింది ఏమీ లేదు. తను ఇంటికి వచ్చిన తర్వాత రెండు కాలెండరు కాగితాలు చింపేశాడు.

ఒకరోజు రాత్రి తొమ్మిదిగంటలకు ఏమీ తోచక ఆవేదనలో గోపాలం షికారుకు బయలుదేరాడు. పార్వతి సంగతి తెలుస్తూనే వుంది. బయట వెన్నెల విరగకాస్తున్నది. ఎక్కడో కుక్క తీరికగా కూర్చుని ఏడుస్తోంది. అనుకోకుండానే కనకయ్య ఇంటిముందువైపు వెళ్ళాడు. అక్కడ జానకి కనపడింది. వాకిట్లో గుమ్మందగ్గర నిలబడి చందమామవంక చూస్తూ ఏదో పాట పాడుకుంటున్నది. తనను చూసింది. గుర్తుపట్టినట్లుగా నవ్వింది. పాట ఆపలేదు. ఆమె కంటిలో మెరమెర వెన్నెలలో కనపడుతోంది. తెల్లటి వాయిలుచీర గాలికి రెపరెపలాడుతోంది. భుజంమీదుగా జారినకొంగు గాలిలో కొట్టుకుపోతూ నురగలుకక్కే నదీప్రవాహంలా వుంది. గోపాలం ఒకక్షణం నిలబడి ఆమె దగ్గరగా వెళ్ళాడు. పాట ఆపేసి అతని కళ్ళల్లోకి ఎంతో తృష్ణగా చూసింది. అతను నిగ్రహించుకోలేకపోయాడు.

“నామీద మీకంతకోపం ఎందుకు....” అంది జానకి. గోపాలం “లేదు...నీమీద కోపంలేదు...” అని అక్కడినుంచి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ఇంటికి వచ్చేశాడు.

రమణయ్య, కనకయ్యలు మళ్ళా పెళ్ళిసంగతి కదిలించారు. ఈసారి గోపాలం ఏమాటకీ ఎదురు చెప్పేస్థితిలో లేడు. “మౌనం అర్ధాంగీకారం...” అన్నారు. ఆమాటకి సమాధానం చెప్పలేదు గోపాలం. చివాలున లేచి వీధిలోకి వెళ్ళిపోయాడు.

వర్ధనమ్మ ఒకవిషయం గమనించింది. గోపాలానికి ఇష్టంకాని పెళ్ళిచేస్తే జీవితపర్యంతం బాధపడతాడని. ఈమాటే రమణయ్యతో చెప్పింది. నవ్వి వూరుకున్నాడు. మళ్ళీ మళ్ళీ చెప్పిచూచింది. రమణయ్య ఆమాటను చెవికి పట్టించుకోవటానికి ఇష్టపడటంలేదు.

ఇద్దరమ్మాయిలూ, ఒక అబ్బాయి...తరతరాలుగా వస్తున్న కథావస్తువులు. ఇద్దరిలో ఎవరో ఒకరిని ఎన్నుకుంటాడు కథానాయకుడు. ఆమె అతన్ని ప్రేమించదు. రెండవ ఆమె అతన్ని ద్వేషిస్తుంది. అదీకథ. లేకపోతే ఇంకోరకంగా జరుగుతుంది. గోపాలానికవన్నీ తెలుసు. వాస్తవిక జీవితంలో తను ఏవిధంగా నడుచుకోవాలి అంటే అతనికేమాత్రం అవగాహన కావటంలేదు.

మళ్ళా ఒకసారి పార్వతిని చూడాలని కలిగింది. కాని ఆమెలోవున్న పసికందు ఆమెకళ్ళల్లోనుంచి చూస్తూఉంటుంది. ఆ కరుకు చూపులు తనుచూడలేడు. చూసి నిలదొక్కుకోలేడు. అందుకనే అతనికి భయం. ధైర్యం కూడబట్టుకుని ఆ రోజు ఆసుపత్రిదాకా వెళ్లాడు. లోపల క్యావు క్యావుమని పసిపిల్ల ఏడవటం వినిపించింది. ఎవరూ ఆ పాప...ఆ ఆసుపత్రిలో ఇంకెంతమందో వున్నారు. ఎవరని? పార్వతికి పాపకలిగిందే...గోపాలం ఉద్వేగం పొందాడు. కన్నీరుకారవంటుంది. కళ్లు మండిపోతున్నాయి. వ్యాకులుడై తిరిగి వచ్చేశాడు.

వర్ధనమ్మ ఇంట్లోకి వస్తున్న గోపాలాన్ని చూసి కళ్లు వత్తుకుంది. అతన్నిచూస్తే ఆమెకెంతో జాలివేస్తోంది. ప్రేమఅంటే ఏమిటో ఎవరునిర్ధారించి చెప్పగలరు. దానికి ఎవరు నిర్వచనం ఇవ్వగలరు. వచ్చేటంతవరకూ దానిని అర్థంచేసుకోలేకుండా ఉండిపోయే వాళ్ళెంతమంది! ఇదంతా వర్ధనమ్మ ఏం చెబుతుంది. అతనికేం కావాలో తనెలా అర్థం చేసుకుంటుంది?

‘ఏం బాబూ...అట్లా అయిపోతున్నావేం...’ అంది ఎంతో అనునయంగా...గోపాలం మెల్లిగా దగ్గరకు చేరాడు.

‘ఏంబాబూ...నీ బాధేమిటో నాకు చెప్పరాదురా...నాదగ్గర రహస్యమేమి నాయనా’ అంది. ఆమెనుచూస్తే గుండెలు తరుక్కుపోతుంటాయి గోపాలానికి...ఏమని చెబుతాడు. ఏమని అర్థం చేసుకోగలదు!

‘పిన్నీ...’ అంటూ ఆమె ఒడిలోకి ఒరిగిపోయాడు. అతని నుదురు వెచ్చగా తగిలింది.

‘సరిగా జ్వరంవచ్చినట్లుంది...ఎప్పటినుంచిరా ఇది...అన్నం సహించటంలేదంటే ఏమిటో అనుకున్నాను...’అంటూ ఆదుర్దా అంతా వెళ్ళబుచ్చింది. అలమారలో వున్న థర్మామీటరు తెచ్చి టెంపరేచరు చూసింది. మీటరు మూడుపైన జ్వరం చూపిస్తుంది.

‘అయ్యో...అయ్యో’ అంటూ కడుపుమీద చెయ్యివేసి చూసింది. ఆ ఆదుర్దాలో తల్లి పేలిపోతున్నట్లు కనిపించింది. గోపాలం నవ్వుతూ ‘నాకేం సుస్తీలేదమ్మా...జలుబుచేసి కొంచెం వెచ్చగా వుంది. అంటూ వేలాడిపోతూ తనగదిలోకి వెళ్లిపోయాడు.

వైద్యుడువచ్చి మందిచ్చి వెళ్లిపోయాడు. గోపాలం అదంతా ఎవరూ చూడకుండా తూములోపోశాడు. దాన్ని ఎవరూ గమనించలేదు. వైద్యం చేతగానివాడని డాక్టర్ని తిట్టిపోశారు.

కనకయ్య వచ్చాడు ఆ రోజున పరామర్శ చేయటానికి. వెంట జానకికూడా వచ్చింది.

ఇద్దరూ సూటిగా గదిలోకివచ్చారు. కనకయ్య ఏవోమాటాడుతున్నాడు. జానకి అలాగే చూస్తూ నిలబడింది.

‘కూర్చో జానకీ...’ అంటూ ఆమెవంక చూస్తూ అన్నాడు. జానకి ఎక్కడలేని సిగ్గునభినయిస్తూ కూర్చుంది.

‘ఏం నాయనా...ఒంట్లో బాగా లేనప్పుడు నిన్నా మొన్నా రాత్రిపూట తిరుగుతున్నావు...అసలే పాడురోజులు...జాగ్రత్తగా ఉండద్దూ...’ అన్నాడు కనకయ్య. గోపాలం అవునన్నట్లు నవ్వి ఊరుకున్నాడు. జానకి అతనివంక చూసి ముసి ముసి నవ్వులు నవ్వింది.

‘చూడు గోపాలం...మళ్లా మాఘమాసం వెళ్ళిందంటే లగ్నాలు మనకు కుదిరినవి దగ్గరలో లేవుట...ఈ శుద్ధంలోనే లగ్నం పెట్టి ఆపని కాస్తా అయిందనిపిస్తే...తర్వాత...’అంటూ నసగటం మొదలుపెట్టాడు కనకయ్య. జానకి పెళ్ళిమాట వచ్చేటప్పటికి అక్కడెందుకని బయటకు వచ్చేసింది. వాళ్ళిద్దరూ చాలాసేపటి వరకూ మాట్లాడుకున్నారు. కనకయ్య ముఖం చిన్నది చేసుకుని బయటకు వచ్చాడు.

వర్ధనమ్మ గుమ్మంలోనుంచే వంటింట్లోకి తీసుకుపోయి 'ఏమిటి...ఏమన్నా రేమిటి...' అంటూ గుచ్చిగుచ్చి అడిగింది.

'కట్నం కావాలిట...'

'ఉహూ...' అంది వర్ధనమ్మ దానిలో తప్పేమున్నదన్నట్లు.

'ఉహూ...అంటావే...కట్నం యిస్తానని నేచెప్పడన్నా చెప్పానా...అయితే గియితే నా ఇల్లు వ్రాసిద్దామనుకున్నాను... పదిహేనువేల రూపాయలు ఎక్కడినుంచి తెచ్చి కుమ్మరించేది... ఇదేమన్నా మట్టిశెడ్డలా...' అన్నాడు చికాకుపడుతూ.

'పదిహేనువేలు అడిగాడా...తమాషాకి అన్నా డేమో...'

'తమాషా లేదు...గిమాషా లేదు...అరగంటనుంచి చెప్పచెబుతుంటే...కనీసం నా మాట చెవికి ఎక్కించుకున్నావూ...'

'అలా ఎప్పటికీ కాదూ...నే నడుగుతానుండు' అంది వర్ధనమ్మ గదివైపు అడుగులు వేస్తూ 'నువ్వెందుకు అడగటం...ఆ పదిహేను వేలిస్తే...ఇంతకంటె బ్రహ్మదేవుడు దిగిరమ్మంటే దిగి వస్తాడు...మీరు వచ్చేపెయ్యకోండి...ఏమయినా చేసుకోండి... నేను పోతున్నాను...రామ్మా జానకీ...' అంటూ జానకి చెయ్యి పుచ్చుకుని, వీధిలోకి తీసుకుపోబోయ్యాడు.

'ఇప్పుడే వస్తా నాన్నా...' అని జానకి గోపాలం వున్న గదిలోకి పోయింది. గోపాలం ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

'నువ్వెందుకు వచ్చావిప్పుడు...పొండి...అంతా బయటకు పొండి....' అంటూ బిగ్గరగా అరుస్తూ ఆమెవంక చూశాడు. ఆమె కంటినుండి చల్లని చూపులు ప్రసరిస్తూ అతని చికాకును కొంతవరకు చల్లారుస్తున్నాయి. జానకి మెల్లిగా కుర్చీ పీట మీదనే కూర్చున్నది. గోపాలం పడుకుని దుప్పటి కప్పుకుని అటు పక్కకు తిరిగాడు. అతనికి గడియచప్పుడు వినబడింది. జానకి వెళ్లి పోయిందనుకున్నాడు. అతని ముఖంమీద చల్లని స్పర్శ కలిగింది. కళ్ళు విప్పిచూశాడు. గడియవేసివచ్చి మంచంపట్టిమీద కూర్చుని వుంది జానకి.

'నేనంటే అంతకోపం ఎందుకు?' మళ్ళీ అదే ప్రశ్న. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. ఆ ప్రశ్న శూలంలా పొడిచేస్తోంది. సమాధానం ఏమిటి. జానకి 'సమాధానం తెలుసు' అన్నట్లు చూస్తోంది.

'మీరు కట్నం కావాలిటగదా...మా నాన్న చెప్పారు... నేను మీకేం అపకారం చేశానని...మీకిష్టం లేకపోతే బలవంతానా మీ ఇంట్లో జొరబడి మీ మనశ్శాంతిని చెడగొట్టదామనిగాదు—నా ఉద్దేశం... నేను ఇలా మాట్లాడటం చాలా ఎబ్బెట్టుగా వుందిగదూ ...సత్యం ఎప్పుడూ కటువుగానే వుంటుంది...మీరు నచ్చనిపని చెయ్యటానికి ప్రయత్నించకండి...నాకేం లోపమని...చదువు కున్నాను...సంగీతం పాడగలను...నేను అందవిహీనురాలినీకాదు ...ఇవన్నీ ఎందుకు చెప్పానో...తెలుసా నా మూలాన మా నాన్న అవమానపడవలసిన అవసరం లేదుగనుక ... ఆ మాట నేను నమ్మాను గనక ... వివాహం చేసుకోవలసింది మన మయినప్పుడు దాని సాధకబాధకాలు మనలను దాటి పెద్ద లకు పోవలసిన దురదృష్టం ఎందుకు కలగాలి...నేనంటే ఎందుకు అంతకోపం మీకు...నాకేం లోపమనీ...' ఎంతో మృదువుగా అతని నుదురు తాకుతూ అంది జానకి. అతను ఆమెచేతిని అతని హృదయానికి దగ్గరగా తీసుకుంటూ 'నువ్వంటే నాకు కోపంకాదు...' అన్నాడు గద్గదకంఠంతో.

'మరి మా నాన్న నెందుకు అవమానంచేశారు...'

'నన్ను నమ్ము జానకీ...ఎవర్నీ అవమానం చెయ్యాలనిగాదు ... చెయ్యలేదు ... నీకేమీ లోపంలేదు ... నాకు తెలుసు...' అన్నాడు.

'ఆ సంగతి నాకూ తెలుసు...నాకేం లోపంలేదనేగదా మీ అభియోగం...మీ వివాహానికి విఘ్నకరాలు, కులట అయితేగాని సరి పోదా...' అంటూ విసురుగా గదిగడియతీసి బయటకు వచ్చేసింది. గోపాలం లేవలేకపోయాడు. 'జానకీ...' అంటూ బిగ్గరగా అరిచాడు.

కనకయ్య జానకి రావటంతోటే 'ఏమిటి జానకీ కబుర్లు, అన్నాడు వ్యగ్రభావంతో. నవ్వింది సమాధానంగా. వర్ధనమ్మ కణతలు నొక్కుకుంది. కనకయ్య జానకిని తీసుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు.

రమణయ్యకూ, వర్ధనమ్మకూ ఇంట్లో తీరుబడే వుండటంలేదు. జానకి కనకయ్యతో గోపాలం తనకు కట్నం లేకుండా ఈ మాఘ మాసంలోనే పెళ్ళి చేసుకోవటానికి ఇష్టపడ్డాడు అని చెప్పినమాట ఇంతవరకు తెచ్చింది. పెళ్లి ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. ఎవరూ గోపాలాన్ని ఈవిషయంలో తిరిగి సంప్రతించలేదు. రమణయ్య, కనకయ్య కలిసి ఒక నిర్ణయానికివచ్చి పెళ్ళి యేర్పాట్లు ప్రారంభించారు. అతనూ ఈవిషయం తిరిగి ఎత్తలేదు. ఆఖరికి శుభలేఖలు అచ్చుకావటం గూడా గోపాలానికి తెలియదు.

అసలే కల్లోలంగా వున్న నూతిలో పెద్ద రాతిబండ పడితే కలిగే అల్లకల్లోలం ఎవరికీ తెలియనిది గాదు. పార్వతికి ఆడపిల్ల అన్న వర్తమానం ఆ క్షణంలోనే తెలిసింది. ఎవరూ ఆశ్చర్యపడలేదు. వర్ధనమ్మ తిట్టిపోసింది. రమణయ్య శాపనార్థాలు పెట్టాడు. గోపాలం కుళ్ళి కుళ్లి ఏడ్చాడు.

ఆరోజు సాయంత్రం గోపాలానికి ఎవరో చీటి తెచ్చియిచ్చి పోయారు. పార్వతి అతన్ని ఒకసారి చూడాలని అనుకుంటోందట. ఆ చీటి రమణయ్య చేతిలో పడింది. చూడటం కావటంతోనే చించిపారేశాడు. గోపాలాన్ని పిలిచి చీవాట్లు పెట్టి చీటిలో ఉన్న సంగతి చెప్పాడు. ఆపాటున గోపాలం మీదపొక్కా అన్నా లేకుండా పక్కనేవున్న తుండుగుడ్డ భుజాన వేసుకుని పరుగెత్తు కుంటూ వెళ్ళిపోయాడు. రమణయ్య అలాగే చూస్తూ నిలబడి పోయాడు.

పార్వతి ఇంకా మంచంమీద పడుకొనివుంది. పక్కన పసి పిల్ల లేదు. గోపాలం మెదడులో తుపాను లేచింది. పార్వతిని సూటిగా చూడలేకపోయాడు. పార్వతి గోపాలం రావటంచూసి 'రండి...' అంటూ పిలిచింది. గోపాలం బిక్కు బిక్కుమంటూ పోయి కూర్చున్నాడు. అతని కెందుకనో మనశ్శాంతి లభిస్తున్నట్లు

తోచింది. ఇంతకాలంగా ఏ అడ్డంకువలన పార్వతినిచూసి సంకోచించాడో ఆ అడ్డంకు తొలగిపోయిందనిపించింది.

'ఎలావుంది...' అని పలకరించాడు. పార్వతి సమాధానంగా నవ్వింది. ఎవరోనర్సువచ్చి మందుసీసా దగ్గరలో పెట్టి వెళ్ళిపోయింది.

'నన్నిప్పుడైనా అర్థంచేసుకోగలిగావా ...' అన్నాడు గోపాలం.

'నాకు సరిగ్గా తెలియటంలేదు...పాపను చూస్తారా...' అని అడిగింది.

'ఆఁ...!!' గోపాలం గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. పాప...అతని ఆశ్చర్యంచూసి పార్వతి చికాకుపడింది.

'నాకు కళ్ళు తిరుగుతున్నాయి...మళ్ళీ వస్తాను...' అంటూ చకచకా వీధిలోకి వెళ్ళిపోయాడు.

'పిన్నీ...పిన్నీ...' అంటూ అరుస్తూ గట్టిగా తలుపుతట్టాడు. వర్ధనమ్మ పరుగెత్తుకుంటూ వచ్చింది.

'నేను పెళ్లి చేసుకుంటాను పిన్నీ' అన్నాడు వెర్రిగా ఆమె వంక చూస్తూ.

'అల్లాగే చేసుకుందువు గానిలే....ముందిర అన్నానికి రా... అసలే పొద్దు పోతోంది! అంది వర్ధనమ్మ.

'అదికాదు పిన్నీ...నాన్నతో కూడా చెప్పాలి... నేను పెళ్లి చేసుకోబోతున్నాను. ఎవరినో తెలుసా...జానకిని పిన్నీ... నాన్నేడీ...' అంటూ ఇల్లంతా కలయ తిరగాడు. రమణయ్య వచ్చాడు తర్వాత. విషయం తెలిసింది. వింతగా చూశాడు. కనకయ్య, జానకి వచ్చారు. రెండు రోజుల్లో శుభలేఖలు అచ్చయిపోయినాయి.

గోపాలం ఒక శుభలేఖ అందుకుని 'బాగుంది... దీనికోసమే ఎంతకాలం నుంచో చూస్తున్నాను... నా కోకిల వెయ్యటంలేదు! అనుకుంటూ గదిలోకి వెళ్ళిపోయాడు.

వర్ధనమ్మ వంటింటిలో నుంచి అరుస్తోంది 'చల్ల పోసుకుని రెండు మెతుకులు తినుబాబూ' అని. గోపాలం ఎవరిమాట వినిపించుకోలేదు. అన్నం తినకుండానే పడుకున్నాడు ఆరాత్రి.

తెల్లవారు తుండగానే లేచి స్నానంచేసి మంచి బట్టలు కట్టుకున్నాడు. శుభలేఖ ఒకటి జేబులో పెట్టుకున్నాడు. తన ప్రేమను అపార్థం చేసుకున్న పార్వతి ఈశుభలేఖ చూసి ఏమనుకుంటుంది. తానే స్వయంగా వెళ్ళి ఆమెను తన పెళ్ళికి పిలుస్తాడు. అప్పుడు పార్వతి నివ్వెరపోతుంది. ప్రేమ విలువ తెలుసుకుంటుంది. కళ్ళు... పళ్ళు...కారు. తన కానందం కలిగించె సమయంలో తీవ్రమయిన ఆలోచనకు తావియరాదు...అనుకున్నాడు గోపాలం.

గోపాలం నూటిగా ఆసుపత్రికే పోయాడు. అప్పటికే గేట్లు అన్నీ తెరిచారు గాని లోపలఅంతా వూడుస్తున్నారు. ఆ వేదనను కప్పిపుచ్చుకుని గేటు బయటనే నిలబడ్డాడు. ఎవరో వస్తున్నారు. పోతున్నారు. ఆసుపత్రిలోకి ఎవరో కొత్త డాక్టరు వచ్చినట్లున్నాడు. అంతా అతనిచుటూ మూగి మాట్లాడుతున్నారు. గోపాలం శుభలేఖ పట్టుకుని పురిటిగది దగ్గరకు వెళ్ళి 'పార్వతీ' అని పిలిచాడు.

'ఎవరండీ...' ఆడగొంతు వినిపించింది లోపలనుంచి.

'నేనే పార్వతీ...' అన్నాడు గోపాలం.

'పార్వతిగారు ఇక్కడ లేరండీ...ఇంకోగదిలోకి మార్చినట్లున్నారు! అన్నది లోపలి కంఠం. గోపాలం అక్కడినుంచి బయలుదేరి బయటకు వచ్చాడు. అక్కడ నర్సులంతా ఇంకా గుంపుగానే వున్నారు. ఆ డాక్టరుతో ఏమిటో మాట్లాడుతున్నారు. ఇంతలోకి ఒక నర్సువచ్చి ఈయనే నండి...' అంది — డాక్టరు గుంపులోనుంచి బయటకువచ్చి 'మీరేనా గోపాలం—అంటే...' అన్నాడు.

'అవును' గోపాలం నసిగాడు.

'పార్వతి తెల్లవారు జామునుంచి కనిపించటం లేదు...' అన్నాడు మాట తొణకకుండా. 'ఆ...' అంటూ తెల్లబోయాడు గోపాలం. కాళ్ళకింద భూమికదిలి పోతున్నట్లనిపించింది. డాక్టరు గోపాలాన్ని పట్టుకుని మెల్లిగా లోపలకు తీసుకుపోయి ఒక కుర్చీమీద కూర్చోపెట్టాడు. అలమారలోనుంచి ఒక ఉత్తరం, శుభలేఖ తీసి ఇచ్చాడు.

'మంచంమీద ఈ రెండు దొరికాయండీ...' అన్నాడు డాక్టరు గంభీరంగా. వణికిపోతూ గోపాలం ఉత్తరం తీసి చదువుతున్నాడు.

గోపాలం గారికి,

నిన్న అర్థమయిందా అని అడిగారే...ఇవ్వాళే అర్థమయింది...మీలో నీతి నశించలేదనీ, సత్యాన్ని కాలదన్నలేదని అనుకుంటూ ఉండేదాన్ని...దాని నిజస్వరూపం ఈ నాడు బయటపడింది....ప్రేమించిన కన్యను వివాహం ఆడటంలో సిగ్గుపడవలసిన అవసరం ఏమీ లేదు. మీ శుభలేఖ నిన్న సాయంత్రం అందింది...నాకేం ఆశ్చర్యం కలగలేదు...పైగా నేనూహించిన సత్యం నా కళ్ళ ముందరకు వచ్చేటప్పటికి నాకు ఎంతో తృప్తి కలిగించింది....మీరు నన్ను ప్రేమించలేదు...ఆ సంగతి నాకు తెలుసు...నన్ను పెళ్లి చేసుకోవటంవలన కలిగే ఫలితాన్ని ప్రేమించారు....మిమ్మల్ని జానకి ప్రేమిస్తుంది....ఆమెకోసం మీరు పేరు ప్రఖ్యాతులమీద ఉన్న మమకారాన్ని చంపుకోలేకపోయారు...త్యాగం చెయ్యలేకపోయారు...తరువాత నిజం తెలిపిందనుకున్నారు...నిజాలు ఎప్పటికీ, ఎన్నటికీ, ఎవ్వరికీ తెలియవు....మనం అనుకునేవి అన్నీ మనవరకూ సంబంధించిన అనుభూతులే...జానకి ప్రేమ జయించింది....ఇంతవరకు నన్ను ఎవరూ ప్రేమించలేదు. ముందరి సంగతి కూడా గట్టిగా తెలియదు. నాపాపవున్నదే...ఇక్కడే వదిలి వెళుతున్నాను... నేనిక్కడ బ్రతకలేను...కలుషితమైన వాతావరణం నన్ను తినేస్తుంది. నన్ను నన్నుగా గుర్తించి ప్రేమించగల వాడు దొరికితే అతనితో కలిసి వుంటాను...నా జీవితం అంతం అయ్యేవరకూ నా అన్వేషణ సాగుతూ వుంటుంది...నాకందులోనే సంతృప్తి...ఏ జన్మలో

పాపాలు ఆ జన్మలోనే అనుభవించటం ఉచితం అనుకుంటాను... అందుకనే పాపను నీ చేతుల్లోవుంచి, నేను లోకం చేతుల్లోకి పోతున్నాను...పాపకి అన్యాయం చెయ్యకండి...నన్ను వెతికించాలని వృథా శ్రమపడకండి....పార్వతి."

ఉత్తరం అంతా చదివి నిర్జీవి అయిపోయాడు. ఆసుపత్రి గోడలన్నీ కలిసిపోయి ఒకేఒక నూలపైన వస్తువులా కనపడుతోంది. ఎవరో నర్సు పాపను తొట్టిలోనుంచి తీసుకువచ్చింది. పాప ఏడుస్తుంది. పార్వతి ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. ఎందుకు వెళ్ళిందో కూడా అతనికి తెలియదు. ఆమె వ్రాసుకున్న కారణాలు అతని ఊహకు సమన్వయం లేదు. తనకు అన్యాయం చేసి వెళ్ళిపోయింది. అందుకు కారణాలు ఒక్కటీ స్పష్టంగా తోచలేదు. పార్వతి కులట అయితే — తనూ అంతే. అందులో వ్యత్యాసం లేదు. పార్వతి తనను 'దగాకోరు' అని అనుకుని వుంటుంది. తను ఆమెనుగురించి ఏ అభిప్రాయాన్ని స్పష్టంగా ఏర్పరచుకోలేదు. ఏది ఎలావున్నా పాప నిర్దోషి. ఇంక ఆ పాప తనది. పాపకు అన్యాయం చెయ్యలేదు.

ఆ పసికందు పెరిగి పెద్దదై 'నాన్నా...' అని తనను పిలిస్తే 'ఏం సమాధానం చెప్పాలి' అనుకున్నాడు. "ఏమున్నది ... 'అవును పాపా నేనే నీనాన్నని' అని చెప్పాలి" అంటూ గొణుక్కున్నాడు.

ఇంతకీ ఎవరు ఎవరిని పెళ్ళిచేసుకున్నారు? అన్నది కాదు ముఖ్యం. ఎవరు ఎవరికి అన్యాయం చేశారు? అని — అదీ కావలసింది.

శ్రీవత్స

వారిచే తయారుచేయబడిన వస్తువులే
ఇప్పుడు వాడబడుచున్నవి.

* స్కిన్‌డెక్స్
కురుపులు, గజ్జి, పుండ్లు, ఎగ్జిమా, చర్మవాపులు వగైరాలకు అమోఘ చికిత్స.

* శ్రీకాఫ్
దగ్గు, ఉబ్బసం నివారించి, శ్లేష్మమును పోగొట్టి హాయినిచ్చే మందు. మంచి రుచికలది.

* వైటోడెంట్
దంతక్రిములను సంహరించి, నోటి దుర్గంధమును పోగొట్టి చిగుళ్ళను పుష్టిపరచి, పండ్లను శుభ్రపరచి తెల్లగా నుంచును.

శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
(ప్రైవేట్) లిమిటెడ్.
(మందులు, రసాయనములు తయారుచేయువారు.)
మద్రాసు - 30.

ది బ్యాంక్ ఆఫ్ బరోడా, లిమిటెడ్,

(స్థాపితం: 1908)

అనుమతించిన మూలధనము	...	రూ.	2,40,00,000
చందా చేసిన మూలధనము	...	రూ.	2,00,00,000
పిలువబడిన, చెల్లించిన ,,	...	రూ.	1,00,00,000
రిజర్వు నిధులు	...	రూ.	1,28,00,000

ప్రధాన కార్యాలయము: బరోడా.
దక్షిణ ఇండియా బ్రాంచీలు :—
ఆల్వే, బెంగుళూరు, కొచ్చిన్, కోయంబత్తూరు, గుంటూరు, హైదరాబాద్, సికిందరాబాదు, మద్రాసు (జార్జిటౌన్, మైలాపూరు, త్యాగరాయనగర్), విజయవాడ.

మా మూడు యేండ్ల క్యాష్ సర్టిఫికెట్లు
4% చక్రవర్థీ సంపాదించును.

నేడు రు. 88.75 పెట్టుబడి పెట్టిన మూడు యేండ్ల తరువాత రు. 100/- వచ్చును. పదిరోజుల నోటీసుతో సర్టిఫికేటు సొమ్ము పొందవచ్చును.

ప్రయాణీకులు చెక్కులు యిప్పుడు యీ బ్యాంకు జారీ చేస్తున్నది. రు. 25/- రు. 50/- రు. 100/- సొమ్ములలో జారీ విలువకే యీ బ్యాంకి బ్రాంచీల్లో దేనిలోనైనా మార్చుకొనవచ్చును.

దేశీయ, విదేశీయ, బ్యాంకింగు వ్యాపారములన్ని రకములైనవి జరుపును.

వి. గోపాలరావు, మేనేజరు, మద్రాసు. ||| ఎన్. ఎం. ఛోక్సీ, జనరల్ మేనేజరు.